సాక్షి
కుమురం భీం
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఆర్టీసీకి కలిసొచ్చిన జాతర
మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర ఆర్టీసీకి కలిసొచ్చింది. ఆదిలాబాద్ రీజియన్‌లో అన్ని డిపోలకు ఆదాయం వచ్చింది.
8లో▸



గుంతల రోడ్లతో తిప్పలు
తిర్యాణి మండలంలోని రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
9లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /22.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగలు వేడి, ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

గంగాపూర్ జాతర ఆదాయం రూ.36.17 లక్షలు



హుండీలో బయటపడిన డాలర్

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించిన జాతరకు ఆలయానికి రూ.36.17లక్షల ఆదాయం సమకూరిందని ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం హుండీ లెక్కించారు. గతేడాది ఆలయానికి రూ.34,67,600 ఆదాయం రాగా.. ఈసారి రూ.36,17,371ల ఆదాయం సమకూరింది. గతంతో పోల్చితే ఆలయానికి రూ.1,49,771 అదనంగా ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం ఆలయానికి జాతర సందర్భంగా నిర్వహించిన వేలం ద్వారా రూ.16.96 లక్షలు రాగా.. ప్రత్యేక దర్శనం టికెట్ల వి క్రయం ద్వారా రూ.1,31,640, సులభ దర్శనం టి కెట్ల విక్రయం ద్వారా రూ.1,72,500, శీఘ్ర దర్శనం టికెట్ల ద్వారా రూ.3,60,000, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.4,440, హుండీ ద్వారా రూ. 12,13,300 ఆదాయం వచ్చిందని ఈవో వెల్లడించారు. అలాగే భక్తుల కానుకల రూపంలో 13 తులాల 700 గ్రాముల వెండి, 12 గ్రాముల బంగారం సమర్పించినట్లు తెలిపారు. హుండీలో గుర్తు తెలియని భక్తులు వేసిన రెండు డాలర్ నోట్లు బయటపడ్డాయి.

మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో



ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్- సిర్పూర్(టి) ప్రధాన రహదారిలోని కోసిని గ్రామం వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు మాట్లాడుతూ.. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడిచే రోడ్డుపై వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నాయకులు మనోహర్, పోచం, నరేందర్, శ్రీనివాస్, షబ్బీర్ హుస్సేన్, రాజు, శోభన్, మారుతి, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పీఠంపై గురి!

- కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వ కసరత్తు
- ఖరారైన రిజర్వేషన్లు.. త్వరలోనే కొత్త పాలకవర్గాలు
- పదవుల కోసం పోటాపోటీ
- 'ఆసిఫాబాద్' కోసం పలువురి ప్రయత్నాలు



ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయం

సాక్షి, ఆసిఫాబాద్: వ్యవసాయ మార్కెట్లకు పాలకవర్గాలను నియమించేందుకు సర్కారు కసరత్తు ప్రారంభించింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని మార్కెట్లకు త్వరలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులను నియమించనున్నారు. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే పాలకవర్గాలను ప్రకటిస్తామని వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ మార్కెట్లకు ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించింది. ఆసిఫాబాద్ మార్కెట్ చైర్మన్ పదవిని బీసీ(మహిళ), కాగజ్‌నగర్ ఎస్సీ (జనరల్), జైనూర్ ఎస్టీ(జనరల్)లకు కేటాయించింది. దీంతో పాలకవర్గాలకు సారథ్యం వహించే చైర్మన్ పదవుల కోసం అధికార పార్టీలో పోటాపోటీ నెలకొంది. స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలను ప్రసన్నం చేసుకుంటూనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆశీస్సులతో మార్కెట్ కమిటీ పీఠం దక్కించుకునేలా పావులు కదుపుతున్నారు.

కాంగ్రెస్ నేతల ప్రయత్నాలు..

మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రభుత్వం ఒక్కొక్కటిగా పాలక వర్గాలను నియమిస్తుండటంతో ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. రెండుచోట్లా కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యులు ఉన్నారు. వారి ద్వారా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారివైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. చాలా మంది తమ కష్టానికి ఫలితంగా మార్కెట్ చైర్మన్ పదవి వస్తుందనే నమ్మకంతో ఉన్నారు.

అర్హత ఇదీ...

మార్కెట్ కమిటీ పరిధిలోని సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయోత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు అర్హులు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలపై ఉండాలి. కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఇక నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్/సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు.. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు.. జిల్లా వ్యవసాయ/ఉద్యాన/పశుసంవర్ధక/మత్స్యశాఖ అధికారుల్లో ఒక సభ్యుడు.. మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు ఉంటారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

ఆసిఫాబాద్ చైర్‌పర్సన్ గిరి ఎవరికో?

జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఎవరిని వరిస్తుందన్నదే ఆసక్తికరంగా మారుతోంది. స్థానిక ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కోవ లక్ష్మి కావడంతో కాంగ్రెస్ నేతలు, ఇన్‌చార్జి మంత్రి ఆశీస్సులు ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ కొనసాగుతోంది. చైర్‌పర్సన్ రేసులో పలువురు ఆశావహులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు శ్యాం నాయక్ మాత్రం మాజీ ఎంపీటీసీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పనిచేసిన ఇరుకుల్ల మంగ పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈమెతో జైనూర్ మార్కెట్ కమిటీకి ఒకరి పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. కాగజ్‌నగర్‌కు సైతం అక్కడి పార్టీ బాధ్యులు చైర్మన్ పదవి కోసం ఎస్సీ నేత పేరు సిఫార్సు చేసినట్లు తెలిసింది.

యువతను సన్మార్గంలో నడిపించడమే లక్ష్యం

- ఎస్పీ సురేశ్‌కుమార్
- జాబ్‌మేళాకు విశేష స్పందన



నియామక పత్రం ఇస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: యువతను సన్మార్గంలో నడిపించడమే లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహించినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్‌లో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతున్న నిరుద్యోగ తీవ్రత తనకు తెలుసని, తాను అక్కడి నుంచే వచ్చానని తెలిపారు. ఉద్యోగం, సంపాదన లేని సమయంలో యువత ఆలోచనలు అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగంలో చిన్నాపెద్దా అనే తేడా చూడకూడదని, చేసే పనిలో ప్రత్యేకత సాధించాలని సూచించారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న ఎంతోమంది కిందిస్థాయి నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. జిల్లాకు చెందిన వ్యక్తి నీలోఫర్ కేఫ్ యజమానిగా మారాడంటే దాని వెనుక ఉన్న శ్రమే కారణమని తెలిపారు. అలాంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, నమ్మకం, నీతి, నిజాయతీ, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 50 మల్టీ నేషనల్ కంపెనీలకు జిల్లా నుంచి 3000 మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 807 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగం సాధించిన వారికి నియామక ఉత్తర్వులు అందించారు. డీఎస్పీలు సదయ్య, కరుణాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఐలు సతీశ్, శ్రీనివాస్, రాణాప్రతాప్, చిట్టిబాబు, ఆర్ఐ పెద్దన్న, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో నా అర్హతలను గుర్తించి ఉద్యోగ అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉంది. ఇంతకు ముందు హైదరాబాద్‌లో రూ.20 వేలకు ఉద్యోగం చేస్తుండే. పోలీసుశాఖ ప్రకటన చూసి జాబ్‌మేళాలో పాల్గొన్నా. అర్హతలు పరిశీలించి నెల వేతనం రూ.40వేలతో ఉద్యోగావకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.
– చంద్రశేఖర్, పరందోలి, మం.కెరమెరి

రూ.35వేల వేతనం



ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నెలకు రూ.7వేలతో నర్సుగా పని చేస్తున్నా. వరంగల్‌లో జీఎన్‌ఎం కోర్సు పూర్తి చేశా. జాబ్‌మేళాకు హాజరుకావడంతో హైదరాబాద్‌లోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌లో నెలకు రూ.35వేల వేతనంతో పని చేసే అవకాశం దక్కింది. జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.
– చాకటి లలిత, కొటారి

నిరుద్యోగ సమస్య తీరుతుంది



ఇప్పటివరకు ఓ ప్రైవేటు మెడికల్ షాపులో రూ.13 వేల వేతనంతో పని చేస్తున్నా. జాబ్‌మేళాకు హాజరు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ సొసైటీ హోమ్‌కేర్ నర్సింగ్‌లో నెలకు రూ.20వేల వేతనం పొందేలా అవకాశం రావడం సంతోషంగా ఉంది. ప్రతీ సంవత్సరంకోసారి ఇలాంటి జాబ్‌మేళా నిర్వహిస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది.
– ఆడె పరమేశ్వర్, శివనూర్, మం.జైనూర్



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

రైల్వేల ఆధునీకరణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

కాగజ్‌నగర్‌రూరల్: రైల్వేల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజలు రైల్వే సేవలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా ప్రధానమంతి నరేంద్ర మోదీ అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలోని 2 వేల స్టేషన్‌ల పరిధిలోని 1500 ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ మండలం శివాపూర్ – బారెగూడ మార్గమధ్యలో రూ.2.50 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌ను ప్రారంభించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ వందేభారత్ వంటి రైళ్లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లోని సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని, లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, నూతనంగా నిర్మించిన ప్లాట్‌ఫాం నం.3లో సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సంజీవయ్యకాలనీ అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని రైల్వే ఉన్నతాధికారులను వినతిపత్రం అందించారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్స్ పోటీల్లో పట్టణానికి చెందిన చిలువేరు త్రినయ ప్రతిభ చూపి మొదటి బహుమతి గెలుచుకుంది. కార్యక్రమంలో రైల్వేశాఖ నోడల్ ఆఫీసర్ సాయికిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, డీఎంహెచ్‌వో తుకారాం, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌వో రమాదేవి, రైల్వే సీసీఐ కైలాష్, సీసీఎస్ భాస్కర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు ఓంప్రకాశ్, సతీశ్, టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- జిల్లా కేంద్రంలో ఘనంగా జయంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే



తీజ్ బుట్టలతో మహిళల ర్యాలీ

ఆసిఫాబాద్‌అర్బన్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్‌లో సోమవారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సేవాలాల్ జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అహింసా సిద్ధాంతానికి పునాది వేసి, ఆచరించి చూపించారని కొనియాడారు. బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు బోధనలతో విశేష కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఫిబ్రవరి 16న వేడుకలు జరిగే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో సేవాలాల్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సేవాలాల్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని రాష్ట్ర సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పట్టణంలో తీజ్ బుట్టలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ ప్రతినిధి గోపాల్‌నాయక్, సేవాలాల్ సమితి జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి బదావత్ శివప్రసాద్, నాయకులు అభినవ్ సర్దార్, రామారావ్, ఆత్మారామ్ నాయక్, రవిందర్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సురేశ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌వో కాళబోయిన సురేశ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అడ ప్రాజెక్టులో ముంపునకు గురైన పిప్రి గ్రామ నాయక్‌పోడ్ గిరిజనులకు కమ్యూనిటీ హాల్ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన షెడ్ ఏర్పాటు చేయాలని కెరమెరి మండలం పిప్రి గ్రామానికి చెందిన నాయిడి చిన్నరాజం, కొమ్రె లస్మక్క దరఖాస్తు చేసుకున్నారు. డిగ్రీ పూర్తి చేసిన తనకు ఉపాధి కల్పించాలని ఆసిఫాబాద్ మండలం వాడిగూడ గ్రామానికి చెందిన దుర్గం రాకేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడికి చెందిన ఈదులవాడ విజయ్‌కుమార్ తనకు అనువంశికంగా సంక్రమించిన భూమికి పట్టా పాస్‌పుస్తకం జారీ చేసి, రైతు బంధు ఇప్పించాలని విన్నవించాడు. 14 సంవత్సరాల క్రితం భూమి కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నానని, ప్రస్తుతం కొందరు అక్రమంగా ఆక్రమించుకొని గొడవ చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామానికి చెందిన తాళ్ల రామయ్య కోరాడు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద డబ్బులు ఇప్పించాలని కోరుతూ ఆసిఫాబాద్ మండలం ఇప్పలనవగాంకు చెందిన జాడి రాజయ్య దరఖాస్తు చేసుకున్నాడు. ఆసిఫాబాద్ మండలం వాడిగూడకు చెందిన కుడిమెత రాజ్యలక్ష్మి.. డిగ్రీ పూర్తి చేసిన తాను కులాంతర వివాహం చేసుకున్నానని, ఉపాధి కల్పించి ఆదుకోవాలని విన్నవించింది. రెబ్బెన మండలం కొండపెల్లి గ్రామంలో కామన్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నానని, స్థానికంగా మీ సేవ కేంద్రం లేక దాదాపు 13 గ్రామాలకు సంబంధించిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నార ని మీసేవ కేంద్రం మంజూరు చేయాలని దుర్గం పవన్‌కుమార్ కోరాడు. సిర్పూర్- టి మండలానికి చెందిన వాడై మల్లేశ్ తాను మండలంలోని వేంపల్లిలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నానని, సేవలను గుర్తించి నియామక పత్రం ఇప్పించాలని కోరాడు. లింగాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో దినసరి వేతనం కింద పని చేస్తున్న తనకు వేతనం సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందవుతుందని, వెంటనే ఇప్పించాలని కోరాడు. వృద్ధాప్య పించన్ మంజూరు చేయాలని చింతలమానెపల్లి మండలం కర్జల్లికి చెందిన చౌదరి ఆగయ్య దరఖాస్తు చేసుకున్నాడు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పుగా రికార్డులు



గ్రామంలో పదెకరాల పట్టా భూమి ఉంది. గ్రామంలో నిర్మించిన చెరువులో 3.33 ఎకరాల ముంపునకు గురైంది. మిగిలిన 6.37 ఎకరాల భూమికి పట్టా వచ్చింది. పట్టాతో పాటు రైతుబంధు వచ్చింది. భూమి మేమే సాగు చేసుకుంటున్నాము. ధరణి రికార్డుల్లో మొత్తం పదెకరాలు చెరువులో పోయినట్లు నమోదైంది. దీంతో రైతు బంధు ఆగిపోయింది. రికార్డులు సరిచేసి న్యాయం చేయాలి.
కుమ్ర యశ్వంత్‌రావు, కోహినూర్(బి), సిర్పూర్-యూ

పింఛన్ మంజూరు చేయాలి



'దాదాపు 60 ఏళ్ల వయస్సు దాటాం. వృద్ధాప్యంలో ఏ పని చేయలేని పరిస్థితి ఉంది. ఆసరా పింఛన్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నాం. అధికారులు స్పందించి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలి..' అని చింతలమానెపెల్లి మండలం కర్జల్లికి చెందిన వాగుమారి బాలక్క, పాలె మొండక్క, లోనారె పోశక్క, బొర్కుటే హన్మంతు, రౌతు లక్ష్మి కలెక్టర్‌ను వేడుకున్నారు.

చెరువు నీళ్లతో పంట నష్టం



మా గ్రామంలో పెద్ద చెరువు కింద 3 ఎకరాల భూమి ఉంది. వర్షాకాలంలో చెరువులో నీరు నిండితే కెనాల్ నుంచి నా చేనులోకి వచ్చి పత్తి, సోయా పంట కొట్టుకుపోయి నష్టం జరుగుతుంది. మూడేళ్లుగా చేతికి వచ్చే పంట నష్టం జరుగుతుంది. అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.
– ఆత్రం మాణిక్‌రావు, సిర్పూర్- యూ

రైస్‌మిల్లర్ల అక్రమ దందా

- పక్కదారి పడుతున్న వరి ధాన్యం
- తనిఖీలు ముమ్మరం చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు
- సిర్పూర్(టి) మండలంలోని మిల్లుల్లో వెలుగు చూసిన అక్రమాలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): జిల్లాలో రైస్‌మిల్లర్ల అక్రమ దందాలు హద్దులు దాటిపోతున్నాయి. ఇటీవల పలు రైస్ మిల్లుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో వరుస అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వం మిల్లులకు సీఎంఆర్ కోసం వరి ధాన్యం కేటాయిస్తుండగా.. ధాన్యం బస్తాలు, నిల్వ, సరఫరాలో భారీ తేడాలు వస్తుండటంతో అధికారులు నివ్వెరపోతున్నారు.

వరుస దాడులు

ఇటీవల జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు రైస్ మిల్లులపై దాడులు పెంచారు. అక్రమాలను గుర్తించేందుకు పకడ్బందీగా తనిఖీలు చేపడుతున్నారు. సిర్పూర్(టి) మండలం వేంపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహ రైస్ మిల్లులో అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇటీవల తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం కేటాయించిన 38,265 సంచుల వరిధాన్యం అందుబాటులో ఉండాల్సి ఉండగా.. కేవలం 2,174 సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. 36,091 ధాన్యం బస్తాలు పక్కదారి పట్టడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లు యాజమాన్యంపై 6ఏ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇది మరువకముందే సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని శ్రీబాలాజీ రైస్‌మిల్లులో ఈ నెల 23న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టేందుకు వెళ్లారు. అయితే ఆ మిల్లుకు తాళం వేసి యాజమాన్యం అందుబాటులో లేకుండా వెళ్లిపోయింది. దీంతో మిల్లుకు అధికారులు మరో తాళం వేసి తాత్కాలికంగా సీజ్ చేశారు. యజమానులు వచ్చిన తర్వాత మిల్లు తెరిచి తనిఖీలు నిర్వహిస్తామని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సోమవారం కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టేందుకు వచ్చారు. మళ్లీ సదరు మిల్లు యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడంతో మిల్లు తాళాలు పగులగొట్టి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 69,394 ధాన్యం బస్తాలు(రూ.5.90 కోట్లు విలువైన ధాన్యం) దుర్వినియోగం చేశారని గుర్తించారు.

అనేక అనుమానాలు..

జిల్లాలోని రైస్ మిల్లులకు ప్రభుత్వం కేటాయిస్తున్న సీఎంఆర్ వరిధాన్యం పక్కదారి పడుతుండటం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. జిల్లా అధికారుల పనితీరుపైనా విమర్శలు వస్తున్నాయి. రైస్ మిల్లర్లు అవకతవకలకు పాల్పడుతున్నా సంబంధిత శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.

క్లుప్తంగా

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

బెల్లంపల్లిరూరల్: అడవిపంది దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పాతబెల్లంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎండల పోశం, రాజయ్యతో పాటు మరో ఇద్దరు గ్రామ శివారులోని మామిడి తోటలో కూలిపనికి వెళ్లారు. అక్కడ పనిచేస్తుండగా అడవిపంది వచ్చి పోశంపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన తోటికూలీలు కేకలు వేస్తూ కర్రలతో పందిని తరిమికొట్టారు. క్షతగాత్రున్ని 108లో బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. బాధితుడిని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు స్వామి, గోపాల్, భూమయ్య, మహేష్, బాలు పరామర్శించారు.

తాపీమేస్త్రీ ఆత్మహత్య

చెన్నూర్: ఉరేసుకుని తాపీమేస్త్రీ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన తాపీమేస్త్రీ ఏటా శేఖర్ (38) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. గతంలో రెండుసార్లు చనిపోతానని ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు వెతికి తీసుకువచ్చారు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గాంధీ ఆస్పత్రికి రాజారాం


రాజారాంతో ఆరోగ్యమిత్ర భాగ్యలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: అనారోగ్యం బారిన పడిన పూర్ణపు రాజారాంను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. 'ఆపదలో కుటుంబం' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి లక్సెట్టిపేటకు చెందిన ఆరోగ్యశ్రీ సిబ్బంది స్పందించారు. ఆరోగ్య మిత్ర భాగ్యలక్ష్మిని ధర్మారంలోని రాజారాం ఇంటికి పంపించారు. రిపోర్టులు పరిశీలించి ఊపిరితిత్తులు, టీబీ సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో మూడునెలలు చికిత్స చేయించుకుంటే నయమయ్యే అవకాశాలున్నాయన్నారు. అక్కడి వైద్యులతో మాట్లాడి పంపిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఇద్దరు దాతలు ఫోన్‌చేసి ఖర్చులకు డబ్బులు పంపిస్తామని చెప్పినట్లు రాజారాం తెలిపారు.

డాక్టర్ రాడు.. మందులు లేవు!

- ఇరవై రోజులుగా నిలిచిన వైద్యసేవలు
- ఆస్పత్రికి వచ్చి వెనుదిరుగుతున్న కార్మికులు
- ఇదీ ఆర్టీసీ ఆస్పత్రి పరిస్థితి



మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రి భవనం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యసేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు 20 రోజులుగా రాకపోవడంతో వైద్యసేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా నెలకు సరిపడా అత్యవసర మందులు లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వందలాది మంది ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అనారోగ్యానికి గురైన కార్మికులు, కుటుంబ సభ్యులు వ్యయప్రయాసలుపడి ఆస్పత్రికి వస్తే వైద్యుడు లేడన్న సమాధానంతో నిరాశకు గురవుతున్నారు.

రెండు జిల్లాల కార్మికులకు పెద్దదిక్కు..

మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులకు సేవలు అందించేందుకు మంచిర్యాలలో ఆస్పత్రి ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల్లో దాదాపు 820 మందికి పైగా కార్మికులు, రిటైర్డ్ కార్మికులు వైద్య సేవలు పొందుతున్నారు. చిన్నపాటి వైద్యం కోసం ఇక్కడికి వచ్చి వైద్యుని సూచన మేరకు మందులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుత కాంట్రాక్టు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడు అనారోగ్యానికి గురికావడంతో ఫిబ్రవరి 6 నుంచి సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. మళ్లీ ఎప్పుడు విధుల్లోకి వస్తాడో తెలియకుండా పోయింది.

నెలవారీ మందుల్లేక..

వైద్యుడి మాటెలా ఉన్నా ఆస్పత్రిలో మందుల కొరత ఉంది. నెలనెలా అందించే బీపీ, షుగర్ ట్యాబ్‌లెట్స్‌తో పాటు అత్యవసర మందుల కొరత ఉండడంతో రోగులకు కొసరి కొసరి ఇస్తున్నారు. ప్రతీనెల 10వ తేదీన మందుల కోసం ఇండెంట్ పెట్టి హైదరాబాద్ నుంచి తీసుకురావాల్సి ఉంది. వైద్యుడు లేకపోవడంతో ఫిబ్రవరి నెలకు సంబంధించిన మందులు తేలేకపోయారు. దీంతో ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది అందుబాటులో ఉన్న గోలీలతో సర్దుబాటు చేస్తున్నారు.

కార్మికులకు తప్పని ఇక్కట్లు..

ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. 50 ఏళ్లకు పైబడిన వారే డ్రైవర్లు, కార్మికులు ఎక్కువగా ఉండడం వల్ల తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్పత్రికి వస్తే వైద్యుడు లేకపోవడంతో ప్రైవేట్ వైద్యున్ని ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు జబ్బు చేసినప్పుడు వైద్యుడి సూచన మేరకు సిక్‌లీవు పొందే వీలుంటుంది. కానీ వైద్యుడు అందుబాటులో లేకపోవటంతో కార్మికులు ఎలాంటి జబ్బుచేసినా విధులకు హాజరు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అవసరమైన మందులు తెప్పించడంతో పాటు ఆస్పత్రికి వైద్యుడు వచ్చేంత వరకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు అనారోగ్యానికి గురికావడంతో విధులకు హాజరు కావడంలేదు. ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేకపోవడంతో దరఖాస్తుల స్వీకరణ చేపట్టాం. ఆసక్తి కలవారు డీఎం కార్యాలయంలో సంప్రదించాలి. ట్యాబ్‌లెట్స్ లేని విషయం నాదృష్టికి రాలేదు. ఆస్పత్రిని సందర్శించి అవసరమైన మందులు తెచ్చేందుకు చర్యలు చేపడుతా.

– రవీంద్రనాథ్, మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్

'ఓరియంట్‌లో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి'

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికలు 2019లో నిర్వహించారన్నారు. రెండేళ్లకోసారి నిర్వహించాల్సి ఉండగా ఐదేళ్లు కావస్తున్నా ఎన్నికల ఊసెత్తడం లేదన్నారు. కార్మిక సంఘాలతో డీసీఎల్ ఇప్పటికే సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు తీసుకుని ఓటరు జాబితా సైతం అందించి అభ్యంతరాలు అడిగినట్లు తెలిపారు. నెలరోజులు కావస్తున్నా మళ్లీ ఎన్నికల తేదీ ప్రకటించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. డీసీఎల్ స్పందించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు సోయం సూరు, ఆడ జంగు, రోడ్డ కిష్టయ్య, మడావి ధర్మరావు,సిడాం రాజు, శ్రావణ్, రోడ్డ రవీందర్, కుర్సింగ సూరు, రాము, తదితరులు పాల్గొన్నారు.

భీమారం ఎస్సై ఆకస్మిక బదిలీ

భీమారం: భీమారం ఎస్సై బి.రాములును ఆకస్మికంగా బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. కాగా ఈ నెల 18న రాములు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు బదిలీ కావడంతో హెడ్ కానిస్టేబుల్ ముత్తయ్యకు ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు.

సౌత్ క్రాస్‌కట్ గని ప్రాంతంలో భూ కబ్జా!


పునాదికోసం తవ్వుతున్న కూలీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 31వ వార్డు పరిధిలో మూసివేతకు గురైన సౌత్‌క్రాస్‌కట్ గని ఆవరణ స్థలాన్ని కొందరు కబ్జా చేసి సోమవారం ఇంటినిర్మాణంకోసం పునాది తవ్వకాలు ప్రారంభించడం చర్చనీయాంశమైంది. హాలర్ వద్దకు వెళ్లే మార్గంలో ఉన్న ఖాళీ స్థలాన్ని అన్యాక్రాంతం చేసిన వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మున్సిపాలిటీ నుంచి ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకున్నట్లు సమాచారం. అయితే కంపెనీ స్థలానికి పత్రాలు ఎలా వచ్చాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. అందులోనూ ఆ ప్రాంతం అత్యంత ప్రమాదకరమైనదిగా సింగరేణి అధికారులు ప్రకటించడం గమనార్హం. రెండేళ్ల క్రితం ప్రస్తుతం పునాది తవ్వకం పనులు చేపట్టిన స్థలానికి ఎదురుగా నాలుగు మీటర్ల దూరంలో గని ఉపరితలంపై భారీ బుంగ పడిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతం నివాసాల ఏర్పాటుకు ఏమాత్రం యోగ్యం కాదని ప్రకటించి సింగరేణి అధికారులు హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. కానీ కొందరు అవేం పట్టించుకోకుండా అధికారులతో కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అటు మున్సిపల్ ఇటు సింగరేణి అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే భూకబ్జా ఆపడంతోపాటు నిర్మాణ పనులు సాగకుండా చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వాలీబాల్ విజేత నర్సాపూర్ జట్టు


ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణస్వామి జాతరను పురస్కరించుకుని గ్రామ యూత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో నర్సాపూర్ జట్టు ప్రథమస్థానంలో, ఖానాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.10,016, ద్వితీయ బహుమతి రూ.5,016 నగదుతో పాటు క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. గ్రామస్థాయిలో నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలలో జంగం మల్లేశ్ జట్టు ప్రథమ బహుమతి, పంగ సృజన్ జట్టు ద్వితీయ బహుమతి అందుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, యాదవ సంఘం అధ్యక్షుడు బొంతల మల్లేశ్, మాజీ ఉప సర్పంచ్ నేరెల్ల రాజగౌడ్, దాతలు జక్కుల శ్రీనివాస్, అయ్యోరు రాజేశం, పాత బాలరాజు, బండ శ్రీనివాస్, జంగం మల్లేశ్, దయాకర్, రఘు పాల్గొన్నారు.

బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణ నిలిపేస్తాం

- టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్


కార్మికులతో మాట్లాడుతున్న పెర్క శ్యామ్

శ్రీరాంపూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిలిపేస్తామని టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్ అన్నారు. సోమవారం ఆర్కే 5 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటుపరం చేస్తూ సింగరేణికి ఇన్నాళ్లు నష్టం చేసిందన్నారు. సింగరేణి కార్మికులకు మేలు చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనన్నారు. కాంగ్రెస్ హయాంలోనే కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు లభించాయన్నారు. కార్మికులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడి గెలిపించాలన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు రంగిశెట్టి శ్రీనివాస్, నంబయ్య, తూముల సత్యనారాయణ, వెంకటేష్, పెద్దిరాజు, ఆడెపు సందీప్, ఎం.రాజేందర్, కే.తిరుపతి, దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓల్డ్‌కాలనీలో ఎస్పీఎం క్వార్టర్ డి-98లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. క్వార్టర్‌లో రాత్రి 1:30 గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు తవ్వకాలు జరుపుతుండగా శబ్దాలు విన్న కాలనీవాసులు రావడంతో వెనుకభాగం నుంచి పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని గడ్డపారలు, పార, పసుపు కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరికాయలు ఉన్న సంచితో పాటు ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: కరీంనగర్ జిల్లాలోని రుక్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు (బాలురు) దరఖాస్తు చేసుకోవాలని గురుకుల సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ విద్యాబోధన, మిలటరీ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు మార్చి 1లోగా ఆన్‌లైన్‌లో htpp/ tswrsplschools.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే వెబ్‌సైట్ నుంచి మార్చి 6 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 9704622832 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువకుడు ఆత్మహత్య

నెన్నెల: మద్యం మత్తులో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జంబి మారయ్య (29) కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుని తండ్రి పోచం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన జాతర

- ఉమ్మడి జిల్లాలో నడిచిన బస్సులు 342
- ఫిబ్రవరి 18 నుంచి 24వరకు రాకపోకలు
- భక్తులను చేరవేయడం ద్వారా రూ.3కోట్ల పైనే రాబడి
- మహా శివరాత్రిపై ప్రత్యేక దృష్టి


మంచిర్యాల బస్‌స్టేషన్‌లో బస్సులు

మంచిర్యాలఅర్బన్: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఆర్టీసీకి కలిసొచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదిలాబాద్ రీజియన్‌లో అన్ని డిపోలకు చెందిన అధికార యంత్రాంగం అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. మేడారానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి బస్సులు నడిపించారు. మంచిర్యాల జిల్లా నుంచి మేడారం జాతరకు అత్యధికంగా భక్తులు వెళ్లడాన్ని గ్రహించిన ఆర్టీసీ యాజమాన్యం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. రీజినల్ మేనేజర్ సోలోమాన్ ఆయా డిపోల మేనేజర్లతో సమన్వయం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఊరటనిచ్చాయి. ఫిబ్రవరి 18 నుంచి 24వరకు జాతరకు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, మందమర్రి, శ్రీరాంపూర్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా డిపోల డీఎంలు పర్యవేక్షిస్తూ బస్సులు నడిపించారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి మొత్తం 342 బస్సులు నడిపి 72,108 మంది ప్రయాణికులను చేరవేశారు. తద్వారా రూ.3,41,51,898 రాబడి వచ్చింది.

ప్రత్యేక బస్సులతో..

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించి అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఉమ్మడి జిల్లాలో 342 బస్సులను 6,13,739 కిలోమీటర్ల మేర తిప్పారు. 59శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) సాధించారు. 72,108 మంది భక్తులను గమ్యస్థానాలకు చేర్చారు. ఇందులో టికెట్ ధర చెల్లించిన ప్రయాణికులంటే మహాలక్ష్మి ప్రయాణికులే ఎక్కువగా ఉన్నారు. టికెట్ ధర చెల్లించి ప్రయాణం చేసిన వారు 33,084 మంది కాగా 39,024 మంది మహాలక్ష్మి ప్రయాణికులున్నారు. మంచిర్యాల డిపో నుంచి నడిపిన బస్సుల ద్వారా రూ.1,05,31,88 ఆదాయం సమకూరింది. ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సుల(చెన్నూర్ పాయింట్) ద్వారా 13,946 మంది ప్రయాణికులను, భైంసా డిపో బస్సుల (శ్రీరాంపూర్ పాయింట్) ద్వారా 16,692 మంది భక్తులను, నిర్మల్ డిపో బస్సుల(మందమర్రి పాయింట్) ద్వారా 9,471 మందిని, ఆసిఫాబాద్ డిపో బస్సుల(బెల్లంపల్లి, ఆసిఫాబాద్ పాయింట్ల) ద్వారా 7,321 మంది భక్తులు, మంచిర్యాల డిపో బస్సుల ద్వారా(మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి) 24,678 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు.

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ఆదాయం(రూ.లలో)	మహాలక్ష్మి ప్రయాణికులు	పెయిడ్ ప్రయాణికులు
ఆదిలాబాద్	65	1,24,405	67,99,504	7,391	6,555
భైంసా	40	72,509	41,72,312	9,014	7,678
నిర్మల్	58	86,818	51,80,271	5,020	4,451
ఆసిఫాబాద్	72	1,36,321	74,67,923	4,027	3,294
మంచిర్యాల	107	1,91,686	1,05,31,888	13,573	11,105

ఇక్కట్లు లేకుండా బస్సులు నడిపాం

మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, అధికారులంతా సమన్వయంతో పనిచేశారు. జాతర వెళ్లే భక్తులకు ఎక్కడా ఇక్కట్లు ఎదురు కాకుండా చూశాం. మంచిర్యాల-మేడారం-మంచిర్యాలకు దాదాపు 72 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాం. మహాశివరాత్రి నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి వేలాల, బుగ్గ, నిర్మల్ డిపోల నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధం అవుతున్నాం. రద్దీని బట్టి ఆయా పుణ్యక్షేత్రాలకు బస్సులను నడిపించేందుకు చర్యలు చేపట్టాం.

– సోలోమాన్‌రాజ్, రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

నాలుగు ఇసుక లారీలు పట్టివేత

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రానికి సమీపంలోని మంచిర్యాల-చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారిలో భీమారం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక లారీలను మైనింగ్, టీఎస్‌ఎంటీసీ అధికారులు సోమవారం ఉదయం పట్టుకున్నారు. రసూల్‌పల్లి, భీమారం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు మైనింగ్‌శాఖ ఏడీ బాలు ఆధ్వర్యంలో అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించి నాలుగు లారీలను పట్టుకున్నారు. పట్టుబడిన లారీలను జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'కార్యక్రమాలకు అన్ని సంఘాలను ఆహ్వానించాలి'

మందమర్రిరూరల్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని, ఇచ్చే వరకు సింగరేణి నిర్వహించే ప్రతీ కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో కూడా గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్ కార్మిక సంఘానికి ఎన్నికల్లో గెలిచిన ఆరు నెలలకు గుర్తింపు ధ్రువీకరణ పత్రం అందించారని, అప్పటి నుంచే కాలపరిమితి మొదలంటూ కుర్చీ పట్టుకు కూర్చున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మిక సంఘాలు కూడా అదే పద్ధతిలో వెళ్తున్నాయని, ఎంత ఆలస్యమైతే అప్పటి నుంచే కాలపరిమితి ఉంటుందని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గెలిచిన కార్మిక సంఘాలకు గుర్తింపు, ప్రాతినిధ్య ధ్రువపత్రాలు అందించేంత వరకు అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని యాజమాన్యానికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

కనులపండువగా అగ్గిమల్లన్న కల్యాణం


అగ్నిగుండం నుంచి నడుస్తున్న భక్తులు


కల్యాణానికి హాజరైన జనం

జన్నారం: మండలంలోని కలమడుగులో సోమవారం అగ్గిమల్లన్న కల్యాణం కనుల పండువగా జరిగింది. ప్రముఖ ఒగ్గు కళాకారుడు బైరి మల్లేశ్ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట మల్లన్న పట్నం వేసి ఒగ్గుకథ చెప్పారు. అనంతరం మల్లన్న కల్యాణం జరిపించారు. స్వామి నామ స్మరణతో, ఒగ్గు కథ కళాకారుల నృత్యాలు, పాటల మధ్య భక్తులు అగ్నిగుండాల నుంచి నడుచుకుంటూ వెళ్లారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు. నరనారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, యాదవ సంఘం అధ్యక్షుడు బొంతల మల్లేశ్, మాజీ ఉప సర్పంచ్ రాజుగౌడ్, యాదవ సంఘ నాయకులు విష్ణుమూర్తి, సత్తన్న, వెంకటేశ్, రాజేందర్, గట్టు మల్లేశ్, శంకర్, శ్రీనివాస్, అజగౌడ్, శ్రీపెల్లి అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీ

- రూ.5.90 కోట్ల ధాన్యం గోల్‌మాల్ అయినట్లు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీఎం నరసింహా

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట శ్రీ బాలాజీ రైస్‌మిల్లులో సోమవారం కరీంనగర్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ నెల 23న తనిఖీలు నిర్వహించేందుకు రాగా యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో తాళం వేసిన రైస్ మిల్లుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తాత్కాలికంగా సీజ్ చేసి వెళ్లారు. సోమవారం తనిఖీ చేసేందుకురాగా రైస్‌మిల్లులో యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో పంచుల సమక్షంలో తాళాలు పగులగొట్టి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో 2022-23, 2023-24 సంవత్సరాలకు ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ 69,394 బ్యాగుల ధాన్యం గోల్‌మాల్ అయినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు డీఎం నరసింహా తెలిపారు. ధాన్యం విలువ రూ.5.90 కోట్లు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వివరించారు. తనిఖీల్లో కరీంనగర్ విజిలెన్స్ అధికారులు ప్రశాంత్ రెడ్డి, అనిల్ కుమార్, దినేష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్‌లు శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యామ్‌లాల్, సిర్పూర్(టి) తహశీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.